

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# మహా నగరోత్సవం

**నేడు, రేపు మన మహబూబ్‌నగర్ మహానగరోత్సవం**

**మహబూబ్‌నగర్ శిల్పారామంలో ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ విజేయేందిర బోయి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటైన సందర్భంగా రెండు రోజులపాటు అత్యంత వైభవంగా మహోత్సవాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమయతమైంది. నేడు, రేపు(ఈ నెల 14,15 తేదీల్లో) మన మహబూబ్ నగర్ మహా నగరోత్సవం కార్యక్రమాన్ని మహబూబ్ నగర్ పట్టణం లోని శిల్పారామంలో ఉదయం 10.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ మహబూబ్ నగర్ కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ఈ నెల 14,15 తేదీలలో నిర్వహించనున్న మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం ఏర్పాట్ల పై కలెక్టర్ అధికారులతో చర్చించారు. వేదిక, స్టాల్ ల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన తదితర ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ మున్సిపాలిటీ మహబూబ్ నగర్ కార్పొరేషన్ గా ఏర్పాటు సందర్భంగా మహబూబ్ నగర్ కార్పొరేషన్ ఆధ్వర్యం లో ఈ నెల 14,15 తేదీల్లో రెండు రోజులు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫన్ గేమ్స్, మూవీ నైట్, మార్కెట్ స్టాల్‌లు, ఫుడ్ స్టాల్ లు, సాంస్కృతిక, ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంట్రీ ఉచితమని, మహబూబ్ నగర్ పట్టణంలోని పుర ప్రముఖులు, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# భేటీ బచావో భేటీ పడావో

**ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త** : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భేటీ బచావో బేటి పడావో ప్రచార రథాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన, లింగ సమానత్వం, బాలిక విద్యపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. భేటీ బచావో బేటి పడావో పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో బాలికల సంక్షేమానికి, బాలికల అభ్యున్నతికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు గ్రామస్థాయిలో ప్రచారం చేయడానికి సాంస్కృతిక కళాకారులచే నాటకాలు, చైతన్యగీతాలతో ప్రచారం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జయ, సిడిపిఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ శైలజ, డిసిపిఓ తిరుపతయ్య, సఖి సెంటర్ అడ్మిన్ క్రాంతి రేఖ, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ నరసింహులు, జనరల్ స్పెషలిస్టులు నర్సిములు, అనిత, విజయ్ కుమార్, కవిత, కరిష్మా, అశ్విని, సాయి, నరసింహ చారి, వెంకట్, లక్ష్మీకాంత్, జనరంజని కల్చర్ అసోసియేషన్ కళాకారులు ఉన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

# అభివృద్ధిలో నెంబర్ వన్ చేయడమే లక్ష్యం

**రూ.15.75 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే యెన్నం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, అభివృద్ధిలో నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 15.75 కోట్ల టియుఎఫ్‌డిఐసి నిధులతో మహబూబ్ నగర్ పట్టణంలోని పలు వార్డులలో సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కాలనీల్లో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థను నిర్వీర్యం చేసి మేయిన్ రోడ్డు మీద పైపై మెరుగులు దిద్ది అదే అభివృద్ధి అని ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు మన మహబూబ్ నగర్ పట్టణంలోని ప్రతి కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా మారడంతో రెట్టింపు నిధులు తెచ్చుకొని మహబూబ్ నగర్ ను అద్భుతంగా అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు జహీర్, అజ్మత్ అలి, ఖాజా పాషా, ఉమర్, మోసిన్, ఇమ్మడి పురుషోత్తం, కిరణ్, రామస్వామి, మంజుల, ముజామిల్, అన్వర్ ఖాన్, జ్యోతి, చర్ల శ్రీనివాసులు, రవికుమార్, అంజద్, తిరుమల వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, మోయిజ్, చంద్రమౌళి, వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, డిఇ విష్ణు, ఎఇ వైష్ణవి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

# భూత్పూర్ పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**- ఆసుపత్రిలో కాన్పు జరగడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్**

**- యునాని, పీహెచ్‌సీ నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి**

**భూత్పూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త** : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి గురువారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (మండల ఆసుపత్రిని) ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను, మందుల రికార్డులను పరిశీలించడంతో పాటు కలెక్టర్ రోజు ఆసుపత్రికి వచ్చే ఓపీ పేషంట్ల రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. రోజు యాభై నుంచి తొంభై మంది వరకు రోగులు ఆసుపత్రికి రావడాన్ని కలెక్టర్ సంతోషంతో పాటు సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేసే సమయంలో ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణీకి ఆసుపత్రి వర్గాలచే సుఖప్రసవం జరగడంపట్ల కలెక్టర్ విజయేంద్ర బోయి సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ఎంఓ డాక్టర్ రబ్‌తో పాటు ఎఎన్‌ఎం, స్థాఫ్ నర్సు ఇతర సిబ్బంధిని కలెక్టర్ అభినందించారు. ఆసుపత్రిలో స్టాఫ్‌కొరతను ఎంఓ డాక్టర్ రబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కలెక్టర్ విజయేంద్ర బోయి పీహెచ్‌సీ కాంప్లెక్స్‌లో ఉన్న యునాని వైద్యశాలను సందర్శించి, యునాని మందులను పరిశీలించారు. యునాని వైద్యశాల సమర్థవంతంగా నిర్వహిస్తున్న యునాని వైద్యులు డాక్టర్ జహీరొద్దీన్‌ను కలెక్టర్ విజయేంద్ర బోయి అభినందించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, ఎంపిడీఓ ప్రభాకర్ ఇతర అధికారులు ఉన్నారు.



భూత్పూర్ పీహెచ్‌సీలో ప్రసవించిన బాలింతను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



యునాని మందుల్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి



ఇసుక డంప్‌లు

## మూడు పువ్వులు, ఆరు కాయలుగా

# ఇసుక మట్టి మాఫియా..

- ప్రభుత్వ, పట్టాభూముల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు
- మండల, పట్టణ నాయకుల అండతో కోట్లలో వ్యాపారం
- పట్టపగలే పదుల సంఖ్యలో టిప్పర్లలో, ట్రాక్టర్‌లలో తరలింపు
- అధికారులకు సమాచారమున్నా ఆ వైపు కన్నెత్తి కూడా చూడరని అరోపణలు



**గద్వాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త** : జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, గట్టు, మల్దకల్ మండలాలతో పాటు పట్టణానికి చెందిన కొందరు నాయకులు అక్రమ ఇసుక, మట్టి వ్యాపారాలు చేస్తూ లక్షలు మొదలుకొని కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం సమీపంలోని ముల్కల పల్లి, అనంతపూర్, సంఘాల, పర్మాల, వజ్రాల గుట్ట, చేనుగొనిపల్లి, వీరాపురం, జమ్మిచెడు తదితర గ్రామాలలో అక్రమంగా మట్టి వ్యాపారం చేస్తున్నారని, గత కొన్ని నెలలుగా ప్రభుత్వ, పట్టాభూముల్లో, పట్టా పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని పలువురు చర్చిం చుకొంటున్నారు. పదుల సంఖ్యలో టిప్పర్లలో, ట్రాక్టర్‌లలో మట్టిని పట్టపగలే అమ్ము కొంటూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నా ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకృతి వనరులకు విఘాతం కలిగిస్తే... ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదు.. వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం అని అధికారులు హెచ్చరికలు చేస్తున్నా అక్రమ వ్యాపారాలు చేస్తున్నా కొందరు నాయకులు మాత్రం భయపడటం లేదు. అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వ ఖజానాకు జమకావాల్సిన మొత్తం అక్రమార్కుల చేతుల్లోకి వెళుతున్న ఎవరు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా ఐజ, రాజోలి, చిన్న తాండ్రపాడు, రాజోలి, తుమ్మిళ్ళ, చిన్న ధన్వాడ, పెద్ద ధన్వాడ, మఖ్తల్, నారాయణ పేట, అడ్డాకుల, పుల్లూరు, పంచిలింగాల తదితర గ్రామాలనుండి అక్రమంగా ఇసుక తెచ్చి గద్వాల పట్టణంలో అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలు పట్టుబడితే అవి మనవాళ్లవే వదిలేయండని బడానేతలు హెచ్చరిస్తున్నారని జిల్లా అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చోట, మోట నాయకులు మట్టిని, ఇసుక వ్యాపారలను మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగిస్తూ రెండు చేతుల లక్షల రూపాయలు అడ్డగోలుగా సంపాదిస్తూ పెద్ద, చిన్నా తేడా లేకుండా రౌడీలుగా చలామణి అవుతున్నారని గద్వాల ప్రజలు వీరి వ్యవహార శైలి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారికి గాడ్ఫాదర్లుగా కొందరు నాయకులు అభయ హస్తం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాను రెండు ప్రాంతాలుగా విడదీసి ఏ ప్రాంతం వారు, ఆ ప్రాంతంలో మట్టి, ఇసుక వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో వీరిపై ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. గత వారం రోజుల కిందట మట్టి తవ్వకాలు జరుపుతున్న వారికి, బడా నేతకు మధ్య కమీషన్ విషయంలో వివాదం రావడంతో తవ్వకాలను నిలిపివేయించారని ప్రచారం జోరుగా సాగుతుంది. అక్రమార్కులు బడా నేతకు చెడ్డ పేరు తెస్తున్నారని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు అధికారులనే బెదిరుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ మట్టి, ఇసుక వ్యాపారంపై మైనింగ్ అధికారికి వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకీ రాలేదు.

# పరిహారంలో పంపిణీలో అక్రమాలు

**అక్రమార్కుల ఖాతాల్లోకి కోట్ల రూపాయలు**

**స్వార్థంతోనే ఉదండాపూర్ సర్వేను**

**అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నేతలు**

**ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

**జడ్చర్ల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** ఉదండాపూర్ రిజర్వాయర్ లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు భూ పరిహారం చెల్లింపులోనూ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వడంలోనూ జరిగిన అక్రమాలపై అధికారులు మరోసారి పునర్విచారణ జరిపించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ నేతలు తాము చేసిన అక్రమాలు బయటపడతాయన్న భయంతోనే ఉదండాపూర్‌లో సర్వే జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. తమ స్వలాభం కోసం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఉదండాపూర్‌కు చెందిన పలువురు నిర్వాసితులు గురువారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని కలిసి భూ పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసారు. ఈ విషయంగా అధికారులను కలిసి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేసారు. నిర్వాసితులు ఈ అక్రమాలకు సంబంధించిన పలు ఆధారాలను కూడా చూపించడంతో ఈ విషయంగా అనిరుధ్ రెడ్డి స్పందించారు. ఉదండాపూర్ రిజర్వాయం లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించడంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని చెప్పారు. భూమి ఒకరిది అయితే దానికి సంబంధించిన పరిహారం ఇంకొకరి ఖాతాల్లోకి జమ చేసారని ఈ కారణంగా నిజమైన బాధితులు పరిహారం కోసం ఇప్పటికీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ధరణిలో పేర్లు, పట్టా పాసుపుస్తకాలు ఒకరి పేరిట ఉంటే దానికి సంబంధించిన పరిహారాలు ఇంకొకరి పేరిట జమ చేసారన్నారు. భూమి ఒకరిదైతే పరిహారాలు ఇంకొకరికి చెల్లించిన సంఘటనలు అనేకం జరిగాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ గైరాన్ భూములను కూడా పట్టా భూములుగా చూపించి పరిహారాలు దండుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఈ విధంగా కోట్లాది రుపాయల ప్రభుత్వ సొమ్మును దిగమింగారని ఆరోపించారు. గైరాన్ భూములకు చెందిన పరిహారాలు బీఆర్ఎస్ నేతల ఖాతాల్లోకి జమ చేసారని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులతో పాటుగా అప్పట్లో ఉన్న తహసిల్దార్, ఆర్ఐ కూడా అక్రమార్కులకు సహకరించి ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టారని అనిరుధ్ రెడ్డి దుయ్యబట్టారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించి తాండాలు, వల్లూరు గ్రామాల్లో సర్వే పూర్తి కాగా ప్రస్తుతం ఉదండాపూర్‌లో ఈ సర్వే జరగకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఉదండాపూర్ లో బినామీ వ్యక్తుల పేర్లు చేర్చి ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టాలని బీఆర్ఎస్ నాయకులు చేసిన కుట్రలు బయటపడతాయనే ఉద్దేశ్యంతోనే విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారని అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. ఉదండాపూర్ పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలను గురించి తాను అసెంబ్లీలో కూడా లేవనెత్తుతానని వెల్లడించారు. పునరావాసం ప్యాకేజీకి సంబంధించి పరిహారం పెంపు కోసం తాను కృషి చేస్తున్నానని చెప్పారు. అయితే బీఆర్ఎస్ నేతలు ఈ విషయాన్ని కప్పిపుచ్చి ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉదండాపూర్ భూ పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలపై తక్షణం పునర్విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఈ అక్రమాలకు ఊతమిచ్చిన అప్పటి తహసిల్దార్, ఆర్ఐల పాత్రపై కూడా విచారణ చేయాలని కోరారు. ఈ అక్రమాలకు పాల్పడింది ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవాలని, నిజమైన బాధితులకు న్యాయం చేయాలని అనిరుధ్ రెడ్డి అధికారులను కోరారు.



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో మాట్లాడుతున్న ఉదండాపూర్ నిర్వాసితులు

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రతి గ్రామంలో ఇల్లు లేని అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎంపీడీఓలను ఆదేశించారు. గురువారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గోపాల్‌నాయక్‌లతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన ప్రతి గ్రామంలో ఇండ్లు లేని అర్హులైన నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కారాదని, అందుకు పూర్తి బాధ్యత అధికారులు వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను నాణ్యతతో కూడిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకు అధికారులు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎంపిక ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో రానున్న ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన దగ్గర మరమ్మత్తులు పూర్తి చేసేందుకు కావాల్సిన ప్రణాళికలను రూపొందించాలని ఎంపీడీఓలను కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధం పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామాలను సందర్శించి పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని 20 మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



మన్నెంకొండ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

# మన్యంకొండ.. జనసంద్రం

**కనుల పండుగ మన్యంకొండ శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం**

**హాజరైన ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి**

**రెండు లక్షల మందికి పైగా భక్తులు హాజరు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్నెంకొండ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు స్వామివారి రథోత్సవ వేడుక కనుల పండుగగా సాగింది. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవానికి తెల్లవారుజామున లక్షలాది మంది భక్తుల నడుమ జరిగింది. వేడుకను తిలకించడానికి ఉమ్మడి జిల్లా నుంచి కాకుండా కర్ణాటక ఆంధ్ర మహా రాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో మన్యంకొండ జనసంద్రమైంది. బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి వేడుకలకు హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈవో మధుసూదన్ కుమార్ తెలిపారు.



మన్నెంకొండ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేంద్ర బోయి , ఎస్పి జానకి

## విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

**పెబ్బేరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ పరిధిలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్తియ డాక్టర్ శ్వేతా,డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండల పరిధిలోని 9, 10వ తరగతులు, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు కంటి పరీక్షలు చేయగా కంటి సమస్యలున్న విద్యార్థులకు మొదటి విడతగా పెబ్బేరు, శ్రీరంగాపూర్‌మండలములోని ప్రభుత్వపాఠశాల,కళాశాలలోనీ 55మందికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కంటి సమస్యలతో బాధప డుతున్న ఎంతోమంది పేద విద్యార్థులకు కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వడంతో మేలు కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫార్మాసిస్ట్ అనురాధ, ప్రశాంతి పాల్గొన్నారు.



రాష్ట్రీయ బాల స్వస్తియ డాక్టర్ శ్వేతా, డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ

## బి.సి.లకు సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి

**ఆత్మకూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు ఏర్పాటు చేసినటువంటి సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగానే బీసీలకు కూడా ప్రత్యేక సబ్ ప్లాన్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆత్మకూరు మండల బీసీ జేఏసీ పొలిటికల్ ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రోజు ఆత్మకూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వాతంత్రం సిద్ధించినప్పటి నుంచి బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే గుర్తిస్తూ మోసాలకు పాల్పడుతున్నాయని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగలను చేపట్టి బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు అమలు చేసేందుకు చీరలు చేపట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా జనగణనతో పాటుగా బీసీ గాన ఏర్పాటు చేసి బీసీలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి వార్షిక బడ్జెట్లో దేశవ్యాప్తంగా బీసీలకు కేవలం 2500 కోట్ల నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని లేని పక్షంలో బీసీలు ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పక తప్పదని ఆయన హెచ్చరించారు.

## పదోన్నతి ఉత్సాహంతో విధులలో మరింత బాధ్యతను పెంచుతుంది : జిల్లా ఎస్‌పి

**గద్వాల,ఫిబ్రవరి13 ప్రభాతవార్త:** పోలీస్ సిబ్బందికి పదోన్నతి ఉత్సాహంతో పాటు విధులలో మరింత బాధ్యత పెంచుతుందని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అన్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా 1999 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు కానిస్టేబుల్స్ అధికారులు ఏ రేఖరెడ్డి, మస్తాన్ ,యాకూబ్ హుస్సేన్‌లు హెడ్ కానిస్టేబుల్స్ గా పదోన్నతి పొందిన సంధర్భంగా వారు గురువారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావును అయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు వారి విధులలో మరింత బాధ్యతను పెంచుతుందని అన్నారు. విధి నిర్వహణలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, కష్టపడి, బాధ్యత తో పని చేసి ప్రజల మన్ననలు పొందితే పోలీస్ శాఖలో ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అన్నారు.



పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

## రక్తదాతలే అసలైన హీరోలు

### మౌంట్ బేసిల్ పాఠశాల రక్తదాన శిబిరంలో లయన్ నటరాజ్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** అవసరం ఉన్నప్పుడు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడే వారే నిజమైన హీరోలని మహబూబ్‌నగర్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ అన్నారు. మయూరి పార్క్ దగ్గర ఉన్న మోంట్ బేసిల్స్ స్కూల్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్,యూత్ రెడ్‌క్రాస్ కోఆ ర్డినేటర్ ఎంసీమెంబర్ డా.సిబాబుల్ రెడ్డి, డైరెక్టర్‌శిరీష,ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపల్ సోమశేఖర్ రెడ్డిలతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాలను తిరిగి తెచ్చే రక్తాన్ని దానంగా ఇవ్వడం మహా గొప్ప దానమన్నారు. తమ రక్తాన్ని దానం చేయడానికి ముందుకొచ్చే వ్యక్తులు నిజ జీవితంలో సూపర్ హీరోలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మొత్తము 21 యూనిట్ల రక్తం ఇచ్చిన మౌంట్ బేసిల్స్ స్కూల్ స్టాఫ్‌ను ఆయన అభినందించడం జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి రక్తాన్ని అందించి అతని ప్రాణాలు నిలపడమే రక్తదానం గొప్పతనమని బాబుల్ రెడ్డి అన్నారు. ఒకరు మరొకరికి ఇవ్వగలిగే అమూల్యమైన బహుమతుల్లో రక్తం ఒకటని అన్నారు. రక్త దానం కార్యక్రమంలో టెక్నీషియన్లు శంకర్, కృష్ణవేణి, స్టాఫ్ నర్స్ సునీత, పరుశురాం, అంజన్న, అశోక్ బేసిల్స్ స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

## మక్తల్‌లో అనుమతులు లేకుండా నడుస్తున్న హైస్కూల్ పై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌యు

**మక్తల్‌టౌన్,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** మక్తల్ కేంద్రంలోని పాత బ్రిలియంట్ హైస్కూల్ భవనం లో నారాయణపేటలో ఉన్నటువంటి రవితేజ హై స్కూల్ పేరుతోటి నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాల యజమానంపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాధికారి అనిల్‌గౌడ్‌కి విన్నతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.భాస్కర్ మాట్లాడుతూ మక్తల్‌లో విద్యను వ్యాపారంగా మార్చుకొని కనీసం నియమ నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఫీజులు దండుకోవడానికి పాత బ్రిలియంట్ స్కూల్ భవనంలో రవితేజ హై స్కూల్ పేరుతో నిర్వహణ చేస్తున్నారు. అనుమతులు లేని పాఠశాలతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసంచేస్తున్న రవితేజ హైస్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వెనకబడిన మక్తల్ లాంటి ప్రాంతంలో విద్య పేరుతో వేలకు వేల ఫీజులు వసూలు చేస్తున్న అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉన్నారు. ఇప్పటికైనా వెంటనే రవితేజ పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి సంధ్య, జిల్లా నాయకులు అజయ్, గణేష్, రాకేష్, మహేష్ లు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## రుద్రసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలనా దినోత్సవం

**మక్తల్ టౌన్,ఫిబ్రవరి 13ప్రభాతవార్త:** ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఇష్టంతో కష్టమైన సరే భవిష్యత్తులో వివిధ రంగాలలో విద్యార్థులు ఎదిగి ఉన్నత పేరు తీసుకు రావాలని ఆశిస్తున్నామన్నారు. బాల్య దశ నుండి విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీయాలనే ఆలోచనతో పాఠశాల స్థాయిలోనే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రాథమికోన్నత పాఠశాల రుద్రసముద్రం ప్రధానోపా ధ్యాయురాలు హేమలత పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని రుద్రసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వయం పరిపాలనా దినోత్సవంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా అర్చన, జిల్లా కలెక్టర్‌గా హారతి, జిల్లా విద్యాధికారిగా కురుమూర్తి, మండల విద్యాధికారిగా అనిల్ అనిల్ కుమార్ వివిధ పోస్టుల హోదాల్లో క్రమశిక్షణతో చాలా హుందాగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రధానోపాధ్యాయురాలు హేమలత, శ్రీ కుమార్ ప్రహ్లాద్, మంజులత, దివ్య జ్యోతి, శ్రీ ఆంజనేయులు, శ్రీ రామ్ కిరణ్, శ్రీ వరుణ్ కుమార్, ప్రమీల పాల్గొన్నారు.



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

## బిఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పాలు చేస్తుంది

### మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి

**ఖిల్లాఘణపురం,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పాలు చేస్తుందని వనపర్తి మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్ లక్ష్మిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో టిఆర్ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో రుణమాఫీ పొందని రైతులతో స్థానిక బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి గ్రామంలో వందల కొద్ది రైతులు రుణమాఫీ పొందని వారున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వారందరికీ రుణమాఫీచేసి ఆదు కోవాలన్నారు. రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు రైతుపేరిట ఆయాగ్రామాల శివారులో భూమి ఉండి పట్టా పాస్‌బుక్ ఉంటేనే అన్ని రకాల ధృవపత్రాలు పరీక్షించిన తర్వాతనే రైతులకు ఆయా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని. మరి ఇప్పుడు మాఫీ విషయానికి వచ్చేసరికి చిన్నపాటి పొరపాట్లను చూపుతూ సన్న చిన్న కారు రైతులకు రుణమాఫీ చేయకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రెండు లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు రెండులక్షల రూపాయలు చెల్లిస్తేనే వారికి రుణమాఫీ చేస్తామని గతంలో ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడంతో, రైతులు అప్పులు చేసి మరీ బ్యాంకులకు రెండు లక్షల వరకు అప్పులు కట్టారని మండల వ్యవసాయ అధికారులు సైతం ఎన్టీఆర్ చేసి ఆయా బ్యాంకులకు రిపోర్టును అందజేశారని ఇంతవరకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. రైతు పెట్టుబడి వేస్తున్నామని రెండు ఎకరాల వరకే వేశారని వరి వేసిన నాటు పొట్ట దశలో ఉందని ఇంతవరకు రైతు పెట్టుబడి వేయక పోవడం రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడమే అన్నారు. రుణమాఫీ కానీ రైతు పెట్టుబడి కానీ గ్రామాలలో కొంతమంది రైతులకు వేసి కొంతమందికి వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని గత బిఆర్ఎస్ ప్రభుత్వం సన్న చిన్న కారు రైతులతో పాటు అన్ని రకాల వ్యవసాయదారులకు రైతు పెట్టుబడి వేసేవారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు మహిళలు నిరుపేదలు ఎవ్వరు కూడా సంతోషంగా లేరని కల్యాణ లక్ష్మీలు లక్ష రూపాయల తో పాటు తులం బంగారం అని మోసం చేశారని ఇంతవరకు తులం బంగారం ఊసేత్తడం లేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ఆదరాబాదరగా సిసి రోడ్లు డ్రైనేజీ లంటూ శంకుస్థాపనలు చేస్తూ టెంకాయలు కొట్టి ఆదరాబాదరగా వెళ్ళిపోతున్నారని రాబోయే స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి రైతులు మహిళలు యువకులు నిరుద్యోగులు తగు రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, మాజీ జెడ్పిటిసి సామ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, మామిడిమడ రంగారెడ్డి గొడుగు సత్యం, గోనెల రామచంద్రయ్య, క్యామ వెంకటేష్, గోదా చిన్న ఆంజనేయులు గౌడ్ ,మల్లారెడ్డి, పలు గ్రామాలకు చెందిన రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .



బస్టాండ్ ఆవరణలో రుణమాఫీ చేయాలని ధర్నా చేస్తున్న రైతులు, బిఆర్ఎస్ నాయకులు

## ఫ్లెక్సీ సంస్కృతికీ స్వస్తి పలకాలి

### సీనియర్ సిటీజన్ ఫోరం కన్వీనర్ మోహన్ రావు, డాక్టర్ రఘునాథ్ రెడ్డి

**గద్వాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** గద్వాల చరిత్ర వైభవాన్ని చాటే త్యాగ పురుషుల విగ్రహాలకు అడ్డుగా ఫ్లెక్సీ బోర్డులు పెట్టడం జరుగుతుందని ఈ సంస్కృతికి అన్ని రాజకీయ పక్షాల నాయకులు, వర్తక వ్యాపారులు స్వస్తి పలుకాలని సీనియర్ సిటీజన్ ఫోరం జిల్లా కన్వీనర్ మోహన్ రావు, కో కన్వీనర్ డాక్టర్ రఘునాథ్ రెడ్డి, సభ్యులు అచ్చన్న గౌడ్, రామన్ గౌడ్, రిటైర్డ్ తహశీల్దార్ బాలకిషన్ రావు లు ఒక ప్రకటనలో కోరారు. గద్వాలలో రాజీవ్ మార్గ్, మున్సిపాలిటీ ఆఫీస్ ఎదురుగా మహారాజు కృష్ణ రాంభూపాల్ చరిత్రకు గుర్తుగా ఫిరంగిలు, త్యాగ పురుషులు పాగ పుల్లారెడ్డి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, స్వామి వివేకానంద, పొట్టి శ్రీరాములు, ఆనంద తీర్థ విగ్రహాలకు అడ్డుగా ఫ్లెక్సీలు కట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు కలెక్టర్ దృష్టికి, మున్సిపాలిటీ కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం మున్సిపల్ కమీషనర్ కట్టకుండా చర్యలు తీసుకోవడానికి నడుము బిగిస్తే, రాజకీయ నాయకులు ఒత్తిళ్ల ద్వారా ఈ పని చేయలేకపోతున్నారన్నారు. గద్వాల సంస్కృతి, చరిత్రను చాటి చెప్పే విధంగా ఉన్న విగ్రహాలకు అడ్డుగా పెక్సీలు కట్టడం వల్ల మన చరిత్ర మరుగున పడుతుందని ఆయన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరిని కోరారు. కావున దయచేసి ఎవరూ కూడా ఇటువంటి చర్యలకు పాల్పడకుండా ఎక్కడైనా, ఎవరికి ఇబ్బంది, లేని చోట ఒక ప్రదేశాన్ని నియమించుకొని ఇక్కడ ఫ్లెక్సీలు నియమించుకుంటే బాగుంటుందని ఆయన సూచన చేశారు. మా సూచన దయచేసి దీన్ని అన్ని రాజకీయ పార్టీలు పాటించి గద్వాల చరిత్రను, త్యాగ పురుషుల త్యాగాన్ని మరుగున, పడే విధంగా చేయవద్దని సీనియర్ సిటీజన్ ఫోరం, డాక్టర్ రఘునాథరెడ్డి, అచ్చన్న గౌడ్, రామన్ గౌడ్ ,బాలకిషన్ రావు తదితరులు విజ్ఞప్తి చేశారు.

## ఏటకేలకు గోవర్ధనగిరి,తుంకుంట బీటి రోడ్డు టెండర్ రద్దు

### నత్త నడక పనుల కారణంగానే తిరిగి రీటెండర్ కు ఖరారు

**వీపనగండ్ల,ఫిబ్రవరి13 ప్రభాతవార్త :** ఏటకెలకు గోవర్ధనగిరి నుండి వీపనగండ్ల మీదుగా తూముకుంట వరకు 13.5కిలోమీటర్ల బీటీరహదారి పనుల టెండర్ రద్దుచేసి రీ టెండర్ కు పిలుస్తున్నట్లు తెలుస్తుంది. 2016 లో గోవర్ధనగిరి నుండి వీపనగండ్ల ,తూముకుంట వరకు మూడు కోట్ల 60 లక్షల రూపాయలు కేటాయించగా అప్పట్లో డబల్ బీటి రోడ్డు కావాలని వీపనగండ్ల గ్రామస్తులు ఆందోళన చేయడంతో తూముకుంట, వీపనగండ్ల వరకు 5.5 కిలోమీటర్ల దూరంలో డబల్ బీటి రోడ్డు నిర్మాణం చేసి అటు పిమ్మట మళ్లీ 2018 లో ఏడు కోట్ల రూపాయలతో డబుల్ బీటీ రోడ్డు వీపనగండ్ల నుండి గోవర్ధనగిరి వరకు చేయాలని అప్పట్లో టెండర్లు నిర్ణయించడం జరిగింది. అయితే అప్పటినుండి ఈ రోడ్డు నత్తనడకన నడుస్తూ ముందుకు సాగకపోగా దాన్ని అలాగే పనులు కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే ఈ రోడ్డు 2016 ,2018 సంవత్సర కాలం దాదాపుగా 22 కోట్ల రూపాయలు రెండు వసల రోడ్డు నిర్మాణానికి ఖర్చు చేయవలసి వచ్చింది. ఈ నిర్మాణము 2020 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నది కాగా ఇది పూర్తి చేయకపోవడం వల్ల గత ప్రజా ప్రతినిధులకు గాని ప్రస్తుత ప్రజాప్రతినిధులకు ఈ రోడ్డు నిర్మాణ నత్త నడకన కొనసాగుతున్న సందర్భంగా ఈ గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత రాష్ట్ర ఎక్సైజ్ , టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ రోడ్డు గతంలో ఉన్న టెండర్‌ను క్యాన్సల్ చేయించి తిరిగి కొత్త టెండర్ ద్వారా ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేయడాని కోసం చర్యలు తీసుకునే విధంగా పాత టెండర్‌ను రద్దు చేయించారు. అయితే త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ పూర్తి చేసేటందుకోసం నూతనంగా టెండర్ ను పిలిచే అవకాశం ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే గోవర్ధనగిరి నుండి తూముకుంట కొల్లాపూర్ వెళ్లే ప్రయాణికులకు, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని ఈ గ్రామాల ప్రజలు ఆశ వ్యక్తం చేశారు. అంతేగాక గోవర్ధనగిరి సమీపంలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తి అవుతే వర్షాకాలం రవాణా వ్యవస్థకు ఆటంకం కలవకుండా ఉంటుందని ఈ గ్రామాల ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనా ఈ రోడ్డు నిర్మాణానికి త్వరగా నూతన టెండర్లు పిలిచి కొత్తగా చేపడితే రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉందని అంటున్నారు.



వీపనగండ్ల ,తూముకుంట మధ్యలోని ఆగిపోయిన బీటి రోడ్డు

## విద్యార్థులకు ఉత్తమ విద్య, పౌష్టిక ఆహారం అందించాలి

**గద్వాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడంతో పాటు, నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులకు ఆదేశించారు. గురువారం గద్వాల మండలంలోని పుటాన్ పల్లి గ్రామంలో తెలంగాణ ట్రైబల్ వెల్‌ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(గర్ల్స్) ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో పరిస్థితులను సమీక్షించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన తయారీ విధానాన్ని నిశితంగా పరిశీలించి, విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, పరిశుభ్రత విషయంలో ఎప్పుడూ శ్రద్ధ వహించాలని అన్నారు, అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి, వారు ఏ విధంగా చదువుతున్నారు, ఏయే సబ్జెక్టులపై ఆసక్తి చూపుతున్నారు, అనే విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచే విధంగా వారికి ఉత్తమ విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొంటూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా చదువు, విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ముసాయిదా జాబితాలపై పార్టీల ప్రతినిధులతో సమావేశం

### 15 ఎంపిటిసి స్థానాలలో రాని అభ్యంతరాలు

**ఇటిక్యాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల షెడ్యూల్ ప్రకారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ జాబితా ముసాయిదా అలాగే పోలింగ్ కేంద్రాల వివరాలు నోటీసు బోర్డుపై ఈనెల 11న ఏర్పాటు చేశారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని 2 మండలాల ఎంపీడీవోలు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఓటర్ జాబితా ముసాయిదా. పోలింగ్ కేంద్రాల వివరాలు వంటి వాటిపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా రాజకీయ మండల పార్టీ ప్రతినిధులకు ఇటిక్యాల ఎర్రవల్లి మండలాలకు చెందిన ఎంపీడీవోలు మహమ్మద్ అజార్ మొహియుద్దీన్, అబ్దుల్ సయ్యద్ ఖాన్‌లు సమావేశం ఏర్పాటు చేయగా బీఎస్పీ పార్టీ నుండి జిల్లా ఉపాధ్యక్షులు మణికుమార్, సిపిఐ పార్టీ నుండి ఆశన్న హాజరు కాగా వారికి జెడ్పిటిసి, ఎంపిటిసి, ఎన్నికల నిర్వహణ ఓటర్ జాబితా పోలింగ్ కేంద్రాల వివరాలను వివరించారు. కాగా ఇటిక్యాల మండలంలో 7 ఎంపిటిసి స్థానాలకు గాను 34 పోలింగ్ కేంద్రాలు. ఎర్రవల్లి మండలంలో 8 ఎంపిటిసి స్థానాలకు గాను 41 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ప్రతి బూత్ కు 700 ఓటర్లు ఉంటారని చిన్న గ్రామపంచాయతీ కావడంతో జింకలపల్లి గ్రామంలో 75 ఓట్లు మాత్రమే ఉన్నాయని ఎంపీడీవోలు వివరించారు.



స్థానిక సంస్థల ఓటర్ జాబితా ముసాయిదా పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎంపీడీవోలు

## సాగులో సాంకేతికత అవలంబించాలి

### కోడుగల్ గ్రామంలో మొక్కజొన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఐఐఎంఆర్, పిజెటిఎయు శాస్త్రవేత్తలు

**మహబూబ్‌నగర్,జడ్చర్ల, ఫిబ్రవరి 13 , ప్రభాతవార్త:** సాగులో సాంకేతిక పద్ధతులను అవలంబించాలని ఐఐఎంఆర్, సిజెటిఎయు శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. జడ్చర్ల మండలంలోని కోడ్గల్ గ్రామంలోనీ రైతుల పొలాల్లో మొక్కజొన్న పంటలో జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్ , సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు, మండల వ్యవసాయధికారి గోపీనాథ్ అధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. పంటల సాగులో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించేలా రైతును ప్రోత్సహించడంతో పాటు సాంకేతికతలపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడం లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మొక్కజొన్న సాగుపై రైతులకు ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలు ని వృత్తి చేయడంతో పాటు, మొక్కజొన్న నుండి ఇథనాల్ ఉత్పత్తి యొక్క ప్రయోజనాలు మరియు మన దేశంలో పెట్రోల్‌తో కలిపిన మొక్క జొన్న ఇథనాల్ యొక్క ప్రాముఖ్యతపై చర్చించారు. మొక్కజొన్న క్షేత్ర దినోత్సవంలో వింటర్ నర్సరీ సెంటర్, ఐసిఎఆర్,ఐఐఎంఆర్ మొక్క జొన్న పరిశోధన కేంద్రం, పిజెటిఎయు,హైదరాబాద్ సంయుక్తంగా ఈసమావేశాన్ని నిర్వహించాయి. జూవిది ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఇంచార్జి డాక్టర్లు ఎన్.సునీల్, సీనియర్ సైంటిస్ట్ పి. లక్ష్మి సౌజన్య , లూథియానాలోని ఐసిఎఆర్,ఐఐఎంఆర్,ఐఐఎంఆర్ నుండి వైపి. కిషోర్ కుమార్, పిజెటిఎయు నుండి డాక్టర్లు సుజాత, వాణిశ్రీ, రైతులు నవీన్ రెడ్డి, నర్సింలు గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మినారాయణ, సాయి రెడ్డి పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, డిఎఓ వెంకటేష్

## సరోజినీ నాయుడుకి నివాళి



సరోజినీ నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

**జడ్చర్ల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలోని ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సరోజినీ నాయుడు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోని ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, కుట్టు శిక్షణ శిబిరం మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

**మద్దూర్,ఫిబ్రవరి13 ప్రభాతవార్త:** మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినటి సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని షీ టీం పోలీసులు చెన్నయ్య, బాలరాజు తెలిపారు. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం, నిడ్జింత గ్రామంలోని జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం రోజు విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిరోజు స్కూలు, కళాశాలకు వచ్చే విద్యార్థులు, మహిళలు టీ సేఫ్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ప్రయాణం చేసే సమయంలో తప్పక ఉపయోగించుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎక్కువగా తెలిసిన వారితోనే వేధింపులకు గురవుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ధైర్యంగా ఉండి షి టీమ్ పోలీసులకు సమాచారం సెల్ నంబర్ 8712670398 కి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని.. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని పోలీసులు సూచించారు.

## రేషన్ బియ్యం పట్టివేత కేసు నమోదు

**ఖిల్లాఘనపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సోలిపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన తేనేటి సాయికుమార్ రెడ్డి గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర రేషన్ బియ్యం కిలో పది రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు సదరు వ్యక్తి ఇంట్లో పరిశీలించగా 9 క్వింటాళ్ల బియ్యము 26 ప్లాస్టిక్ బస్తాలలో ఇంట్లో నిల్వచేసి ఉండటంతో రేషన్ బియ్యం కొనుగోలు చేయడం అమ్మకాలు చేయడం చట్ట విరుద్ధమని పంచుల సమక్షంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వనపర్తి స్టాక్ పాయింట్ కు తరలించినట్లు చెప్పారు. బియ్యం కొనుగోలు చేసిన సాయికుమార్ రెడ్డి పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఏఎస్పై సత్యనారాయణ గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వనపర్తి కార్టూనిస్ట్ కు సన్మానం




కార్టూనిస్టు ను సన్మానిస్తున్న రమణాచారి

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** జీవిఆర్ కల్చరల్ పౌం దేషన్ హైదరాబాద్, హాస్యానందం మాస పత్రిక సంయుక్తంగా గత నెలలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో, వనపర్తి పట్టణానికి చెం దిన విశ్రాంత ఉపాధ్యాయులు కొండకింది శేషిరెడ్డి పాల్గొని విజే తగా నిలిచి క్యాష్ అవార్డును గెలుచుకున్నారు. ప్రభుత్వ పాఠశా లలలోని విద్యను కీర్తిస్తూ వేసిన కార్టూనులు ఈ పోటీలలో ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. శ్రీత్యాగరాయ గాన సభ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యాక్రమంలో నగదు పురస్కా రం, జ్ఞాపిక కె వి రమణాచారి చేతులమీదుగా అందుకొన్నట్లు ఆయన తెలిపారు. వనపర్తికి చెందిన కళాకారుడు ఈ సన్మానం గర్వించదగిన విషయం అని శేషిరెడ్డిని సాహితీ కళావేదిక అధ్యక్షు డు పలుస శంకర్ గౌడు ,ఉపాధ్యాయులు భైరోజు ,చంద్రశేఖర్, సేక్యానాయక్ , విజయభాస్కర్ రెడ్డి, బౌద్ధారెడ్డి, రాములు, డా.శ్యాంసుందర్, కురుమూర్తి, బక్కన్న, ఆయనను అభినందించి సన్మానించారు.

# యాచకురాలిపై అత్యాచారం ఆపై హత్య...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగాన, ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ గేటు దగ్గర ఓ అనాథ మహిళ మృతి చెందిన ఘటన కాలనీవాసుల ద్వారా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని సమీప వ్యక్తులతో విచారించగా... నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కావలి శాంతమ్మ (45)గా నిర్ధారించారు. ఈమెకు భర్త, పిల్లలు ఎవరూ లేరని, కొన్ని రోజుల నుండి అనారోగ్యం కారణంగా జిల్లా ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చేదని అన్నారు. తనకు ఎవరు కుటుంబ తోడు లేకపోవడంతో అనాథగా జీవనం సాగిస్తూ, ఆసుపత్రిలో పెట్టే ఉచిత భోజనం తిని ఆసుపత్రి పరిసరాల్లోనే తిరుగుతూ కాలం గడిపేదని గ్రామస్తులు చెప్పారు. కాగా ఈమెపై ఎవరో అత్యాచారం జరిపి ఆపై హత్యచేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ హత్యకు గల కారణాలను, కారకులను తెలుసుకునే విషయంపై పోలీసులు వెంటనే విచారణ చేయనున్నారని చెప్పారు.



మృతదేహం వద్ద పరిశీలిస్తున్న సీఐ, సిబ్బంది

# నాన్ ఓవెన్ ఫ్యాబ్రిక్ బ్యాగ్స్ ఆవిష్కరణ

**ప్లాస్టిక్ నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం**

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకుందామని గురువారం నారాయణపేట పట్టణంలోని సునంద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో నారాయణపేట మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు చేత నాన్ ఓవెన్ ఫ్యాబ్రిక్ బ్యాగ్స్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణకై ప్రతి పౌరుడు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మన ప్రకృతిని మనమే కాపాడుకోవాలని అన్నారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాద్ శెట్టి అభినందిస్తూ పర్యావరణ పరిరక్షణ పట్ల వారు బాధ్యతతో మెలగడం చాలా గొప్ప విషయమని,ఇలాంటి ప్లాస్టిక్ రహిత కార్యక్రమాల ద్వారా సమాజానికి మీరు ఎంతో ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.దీపికా శెట్టి, డా.అక్షయ,హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఓవెన్ ఫ్యాబ్రిక్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

# విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం విజయవంతం

**పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ,మాజీ ఎంపిటిసి అభిమన్యు రెడ్డి**

**రాజాపూర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో పోచమ్మ అమ్మవారు, పరుష రామస్వామి విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం గురువారం విజయవంతంగా గ్రామ పెద్దలు నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్టాపన దాతలు మాజీ ఎంపీపీ నర్సింలు కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ బచ్చిరెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, మాజీ ఎంపిటిసి అభిమన్యు రెడ్డి పూజలు నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ దైవచింతనంతో మానసిక ఉల్లాసం కలుగుతుందని భగవంతుని ఆరాధించడం వల్ల మనసు ఎప్పుడు సంతోషంగా ఆనందంగా ఉంటుందన్నారు. మహోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వివిధ పార్టీల నాయకులు వివిధ సంఘాల అధ్యక్షులు యువజన సంఘాల నాయకులు యువకులు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే, మాజీ ఎంపిటిసి

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

**కళాశాల ప్రిన్సిపల్ స్వరూపరాణి**

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు చేరాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప రాణి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆమె సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిననిరుపేదకుటుంబాల విద్యార్థిని విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ కళాశాలలో చేరవద్దని ప్రభుత్వం మన మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో 10వ తరగతి విద్యార్థులను స్థానికంగా ఉండే ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థినిలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేష్, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపల్

# డ్రైనేజ్ పనులుకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డ్, 08వ వార్డ్, 13వ వార్డ్, 17వ వార్డ్, 22వ వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మరియు ఓపెన్ డ్రైనేజ్ పనులకు గురువారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి చేస్తామన్నారు. వర్ష కాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ తీగల సునేంద్ర, కావలి శ్రీను, జక్క రాజు, బాదం సునీత, నరేందర్, నిజాం, విజయ భాస్కర్, అప్పల శ్రీను, రేణుబాబు వారితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, డైరెక్టర్ శేఖర్, తీగల జగదీష్, జహంగీర్, ప్రవీణ్, పిడికిళ్ల శ్రీను, పాపమ్మ, హరీష్ గౌడ్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

**రూ.2 లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కు అందజేత...**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పార్టీ కోసం పని చేసే వారికీ బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. తాడూర్ మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ కార్యకర్త కెంగూరి రాజు గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందడంతో పార్టీ ప్రమాద బీమా పథకం కింద రూ. 2లక్షల చెక్కును మంజూరు చేయించి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి గురువారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామా స్థాయి నుంచి పార్టీని పటిష్టపర్చడంలో కార్యకర్తల పాత్ర క్రియాశీలకమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా వర్తిస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. 15 నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజు కుటుంబానికి ప్రమాద భీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

# గ్రామీణ ప్రాంతాల్లో పశు సంతతి పెంచడమే లక్ష్యం

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గంలోని ఎంపిక చేసిన మూడు గ్రామాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాలను వనపర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వనపర్తి మండలం పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైనట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు, ఇప్పటికే వనపర్తి నియోజకవర్గంలోని ఎంపిక చేసిన మూడు గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రైతులకు ఉచిత మందుల తో పాటు ఉచిత చికిత్సలు నిర్వహించడం జరిగిందని అంతరించిపోతున్న పశుసంవర్ధక శాఖను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాలలో పశు సంతతి పెంచుకోవడానికి రైతుల అవగాహన కల్పిస్తూ రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం ప్రజా సంక్షేమం కోసం రైతు ప్రభుత్వంగా రైతుల కోసం పరితపిస్తూ పని చేస్తుందని అన్నారు. ఈ పశువైద్య శిబిరాలు గ్రామాలలో రైతులకు ఎంతో దోహదపడుతున్నాయని పశువులు వ్యవసాయానికి వెన్ను దండుగా నిలుస్తున్నాయని అన్నారు. అలాంటి పశు సంపదను


ఎమ్మెల్యే మేఘారెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

## మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ముగిసిన పశు వైద్య శిబిరం

## ఎమ్మెల్యే ఆదేశాలతో పశు సంరక్షణ

కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సందర్భంగా అన్నారు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆయన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఒకపక్క మార్కెట్ యార్డ్ కు ధాన్యాన్ని తరలిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరతోపాటు ఎలాంటి మోసాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ యార్డ్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కష్టాలు నష్టాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పశు సమర్ధక శాఖ జెయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి కిరణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శారద, గోపాల్ నాయక్, శాంతన్న వివిధ గ్రామాల ప్రజలు పెద్దగూడెం మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆ గ్రామ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సగర శంఖారావ సభను విజయవంతం చేయాలి

**- తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి - రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** సగర సంఘం న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఈ నెల 16న సగర శంఖారావం పేరుతో సభ నిర్వహిస్తున్నామని సగర రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికృష్ణ అన్నారు.గురువారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సగర సంగం రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. సగర కులం అంటేనే శ్రీరాముని వారసత్వం, భగీరథుని వంశం అని అన్నారు. కానీ ఇప్పుడు సగర కులం అంటేనే రోజువారి కూలీలుగా తాపీ మేస్త్రిగా మిగిలి పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. చారిత్రక కట్టడాల్లో తమ రక్తపు బొట్టు ఉంటుందని గుర్తు చేశారు.రెక్కాడనిదే డొక్కాడని పరిస్థితుల్లో మా సగర సంగం ఉందని తమ డిమాండ్లను పరిష్కరించి మాకు ఉపాధి,ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తమను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఇప్పుడున్న ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అందులో మా సగర వాటా ఎంత..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ కోటాను సవరించాలన్నారు. ఫెడరేషన్‌గా ఉన్న మమ్మల్ని కార్పొరేషన్‌గా గుర్తించి చైర్మన్ పదవి సగర కులస్తులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఈనెల 16న నిర్వహించేసగర శంఖం భారీబహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ నుంచి మొదలుపెట్టిన ఈ సభ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జ్ మోడం ఆంజనేయులు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ చందర్, ప్రధాన కార్యదర్శి వేముల సుధాకర్, కోశాధికారి పడకంటి రాజు, వివిధ గ్రామాలకు చెందిన కుల సంఘ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముత్యాల హరికృష్ణ

# ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

**ఇటిక్యాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయిలో రాణించి మంచి ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని ఉదండాపురం గ్రామంలో వివేక్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు వివేక్ బుక్ సెంటర్ యజమాని భీమన్న ఆధ్వర్యంలో రూ. 40 వేల విలువగల వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు హాజరు కాగా వారికి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు . ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్స్, పలకలు వంటివి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కోసం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తనవంతు సహాయంగా రూ.25 వేల విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయిలో ఎదిగి మంచి ఉద్యోగాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు కూడా ఎంతో కష్టపడి పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నారని ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా విని చదువులో చురుకుగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ భీమన్న, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి నాయక్, నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఉదండాపురం గ్రామంలో విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** హైడ్ క్రాఫ్ట్ చేతివృత్తుల నైపుణ్యం హ్యాండ్ క్రాఫ్ట్ హైదరాబాద్ వనపర్తి జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకారులకు సైబర్ నేరాల పై బ్రహ్మంగారి గుడిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల స్వర్ణకారుల ప్రభుత్వంగా ఉండాలని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా బ్యాంకు, ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా, ఫేస్బుక్, ఫోన్ కాల్స్, వాట్సాప్, లింకులు పట్ల జాగ్రత్తగా ఉండాలని వారు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని వారు అన్నారు. వ్యక్తిగత సమాచారం చోరీ చేయడం నష్టాలు కలిగించడం వంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు అన్నారు. అంతేకాక రోజువారి వాడే మొబైల్స్ లో ల్యాప్టాప్ల ద్వారా మన డేటాని హ్యాక్ చేసి పలు రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటానికి డైజేషన్ ఫౌండేషన్, గూగుల్ సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ,మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బ్రహ్మచారి, వనిత ,జ్యోతి అధ్యక్షురాలు ,ఏకే ఖమర్ ,రహమాన్ ,స్వర్ణకార సంఘాల ప్రతినిధులు స్వర్ణకారులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి :మాజీ ఎమ్మెల్యే ఆల

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఇప్పటికి నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. తప్పుల తడకగా కులగణన సర్వే చేపట్టి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆయన దుయ్యబట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వ పనితీరు ఇప్పటి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని అన్ని వర్గాల సంక్షేమానికై కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తే ఈ ప్రభుత్వం బూటక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికీ రైతుల ఖాతాలో రైతు భరోసా పూర్తిస్థాయిలో నగదు జమ కావడం లేదని కళ్యాణలక్ష్మిలో తులం బంగారం, మహిళలకు రూ. 2500 వేలు ఇప్పటికీ ఇవ్వలేదని ఆయన తెలిపారు. సర్పంచ్ మండల పరిషత్ ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంగా పనిచేసే అన్ని పదవులను పార్టీ నాయకులు పొందాలని ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని రేవంత్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కులగణన సర్వే పేరిట ప్రభుత్వం నాటకానికి తెర తీసిందని ఇది ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజాకర్షణ ఉన్న నేతలను గుర్తించి స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ఇప్పటి నుంచే ప్రజల మధ్య ఉండాలని నాయకులకు మాజీ ఎమ్మెల్యే సూచించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా కలిసికట్టుగా స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేలా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కోట రాము, నాయకులు వేణుగోపాల్, మోహన్ గౌడ్, వట్టెం రాము, సర్పంచులు రవీందర్ రెడ్డి, రఘువర్ధన్ గౌడ్ సతీష్, కాంతారావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ**

**లింగాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆవుసలికుంట,కెసి తాండ, చెన్నంపల్లి, రాయవరం, చెన్నంపల్లి, అంబట్ పల్లి, జీల్లుపల్లి, మాడాపూర్, సూరపూర్, వల్లభాపూర్ తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ధారారం గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నుండి మంజురైన సిసి రోడ్లు నిర్మాణం కోసం పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన ప్రజా ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు డ్రైనేజ్ విద్యుత్ త్రాగునీరు వంటి మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాస రావు,మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, నాగర్‌కర్నూల్ జిల్లాయూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ డా.శ్రీనివాస్‌రాథోడ్,మాజీసింగల్ విం డో చైర్మ న్ కొండల్‌రావు,వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌నాయక్,మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, టౌన్ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి ,సర్రం రాజు, సర్రం రాంజీ, సింగం రాజాలు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ సబ్ ప్లాన్ శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

## ఎమ్మెల్యే ఆదేశాలతో పనుల్లో వేగవంతం


లీకేజీలను సరి చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** నారాయణపేట మున్సిపాలిటీలోని ఆయా వార్డులలో ఉన్న లీకేజీలను సరి చేసి నీటిని వృధాగా పోవడాన్ని అరికట్టాలని ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. దీంతో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టణంలోని 7వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో లికేజి పనులను వేగవంతం చేశారు. మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సలీం ముందుండి పనులను చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన కర్తవ్యమన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని వృధా చేయకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## నేడు సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక

**వెల్దండ,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని వివిధ గ్రామాలలో 14వ విడత సామాజిక తనిఖీబృందాలు తనిఖీ నిర్వహించి తుదినివేదిక సమర్పించుటకు నేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉదయం 10గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తామని ఎపీఓ ఈశ్వర్‌జీ తెలిపారు.కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.మండలంలోని గురువారం సామాజిక తనిఖీబృందాలు వెల్దండ రూ.18లక్షలు,రాచూరు రూ.32లక్షలు, భైరాపూర్ రూ.33లక్షలు,గుండాల రూ.9లక్షలు,శంకరకొండ తాండ రూ.8లక్షలు, లింగారెడ్డిపల్లి రూ.12లక్షలు, చెర్కూర్ రూ.20 లక్షలు, ఉబ్బలగట్టు తాండ రూ.12 లక్షలు, అల్లంతోటబావి తండా రూ.11 లక్షలు, రాఘాయిపల్లి రూ.19 లక్షలు, పల్గుతాండ రూ.3లక్షలు, నగరగడ్డ తాండ రూ.8లక్షలు, బర్కత్‌పల్లి రూ.13 లక్షలు ఉపాధి హామీ పనులు నిర్వహించినట్లు అడిట్ బృందం గుర్తించింది. చేసిన ఈ పనులపై నేడు ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా వేదికలో సమర్పించనున్నారు.

## చేపల వేటకు వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి

**నవాబుపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో మునిగి ప్రమాదవశాత్తు వ్యక్తి మృత్యువాత పడ్డ ఘటన మండల పరిధిలోని సిద్దోటం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే సిద్దోటం గ్రామవాసి సుప్పరి లింగయ్య తండ్రి పెంటయ్య (50) కులం తెలుగు బుధవారం గ్రామ సుప్పరి లింగయ్య చెరువులో చేపలు పట్టటానికి వెళ్లి ప్రమాదవశాతు చెరువు నీటిలో మునిగి కనిపించకుండా పోయాడు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు చెరువు నీటిలో శవమై కనిపించడంతో భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతికి ఎమ్మెల్యేకు మాజీ మంత్రి కి ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గిరిజన నాయకులు

**రాజాపూర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** ఈనెల 15వ తేదీన రాజాపూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు, భోగ్ భండార్ కార్యక్రమానికి హాజరు కావాలని గురువారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ చించోడు అభిమన్యు రెడ్డిలను హైదరాబాద్‌లో కలిసి కోరినట్లు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ కమిటీ చైర్మన్ విస్లావత్ శ్రీనివాస్ నాయక్, మాజీ జడ్పీటీసీ మోహన్ నాయక్, మాజీ ఎంపీపీ సుశీల రమేష్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, రాజాపూర్ మండల వివిధ పార్టీలకు చెందిన గిరిజన నాయకులు తెలిపారు.

## పాఠశాల పూర్వ విద్యార్థి విరాళం



**నవాబుపేట,ఫిబ్రవరి13 ప్రభాతవార్త:** చిన్నప్పుడు తను చదువుకున్న యన్మన్‌గండ్ల పాఠశాలపై మమకారంతో పాఠశాల అభివృద్ధి కొరకై గ్రామవాసి పాఠశాల పూర్వ విద్యార్థి బిక్కుమళ్ల రాంచంద్రయ్య రూ.10,116/లు నగదును స్కూల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా. జి.శ్రీనివాస్ కి అందజేసి తన దాతృత్వాన్ని పాఠశాలపై తనకు గల మమకారాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవాబుపేట మండల ఎంఈఓ నాగ్యానాయక్ విచ్చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ దాత బి.రామచంద్రయ్యని స్ఫూర్తిగా తీసుకుని గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు,యువకులు పాఠశాల అభివృద్ధికై తమ వంతు చేయూతనందించాలని కోరారు.ఈకార్యక్రమములో ఎస్.శివ దర్శనం గౌడ్ , డా.జి.శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్కూల్ భవనం ప్రారంభోత్సవంలో

### కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి

**మద్దూర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూర్ పట్టణ కేంద్రంలో గురువారం ముఖ్యమంత్రి సోదరుడు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి బాలికల హైస్కూల్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎంపీడీవో కంపౌండ్ వాల్‌లో సింగిల్ విండో భవనానికి ఒక కోటి పది లక్షల రూపాయలతో నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని భూనీడు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమి పూజ చేశారు. కొత్తపల్లి మండల కేంద్రంలో రూ. 8 కోట్ల 80 లక్షలతో మండల పరిషత్ కార్యాలయానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ అధికారి వెంకట్ రెడ్డి, మద్దూర్ సింగిల్ విండో చైర్మన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహ, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ సంజీవ్, కాంగ్రెస్ నాయకుడు వీరేష్ గౌడ్, గణప చంద్రమోహన్, కుక్కల బాలరాజ్, కొత్తపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**బిజినపల్లి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరూ కళ్యాణ లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మండలంలోని గిరిజన తండాలకు చెందిన 21 మంది కళ్యాణ లక్ష్మిలబ్ధిదారులకు గురువారం కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 21 మంది గిరిజన బిడ్డలకు లక్ష రూపాయల చొప్పున కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తహసిల్దార్ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ భారతి, భగవంతు గిరిజన నాయకులు మాన్య నాయక్, గోవింద్ నాయక్, కాట్రావత్ చందులాల్, పాండు నాయక్, రాంచందర్ నాయక్, హన్మనాయక్, హున్యా నాయక్, రాజు నాయక్, వాల్యానాయక్, పూల్యానాయక్, కృష్ణానాయక్ తదితరులు ఉన్నారు.

## వేములలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన

**ఇటిక్యాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు విద్యతో పాటు చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవిత విద్యార్థులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని వేముల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతేకాక విద్యార్థులు బాగా శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకొని గ్రామానికి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అదేవిధంగా ప్రభుత్వ చట్టాలపై కూడా పూర్తిగా అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితను ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అమీర్ పాషా, హెచ్ఎం ఆర్. హనుమంతు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులచే ఉపాధ్యాయుల పనితీరు, బోధన విధానం ను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువులో విద్యార్థులు నైపుణ్యాన్ని పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి 10/10 మార్కులు సాధించాలని సూచించారు. అదేవిధంగా పిఎం శ్రీ నిధులు విధులు గురించి స్టాఫ్ తో చర్చించి ఖర్చు చేయవలసిందిగా ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం అందుతుందా లేదాయని తెలుసుక్కు క్వాలిటీ ఉండాలని చెప్పారు. రికార్డులు మెయింటెన్ చేయాలని సూచించారు. డీఈఓ వెంబడి సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాస్, జిహెచ్ఎం అశోక్, ఉపాధ్యాయులు శంబులింగం, మల్లికార్జున్, కనకప్ప, అమృత, తిప్పన్న తదితరులు ఉన్నారు.

## తరగతి గదిలో ఉంచి తాళం వేసిన ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై విచారణ

**లింగాల ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** మండలంలోని శాయిన్ పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటవ వతరగతి చదువుతున్న శరత్ అనే బాలుడిని బుధవారం తరగతి గదిలో ఉంచి తాళం వేసిన సంఘటనపై గురువారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా బాలుడిని తల్లిదండ్రులు, గ్రామస్తుల సమాక్షంలో పాఠశాల హెచ్ఎం గణేష్ ను, ఉపాధ్యాయులను విచారించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో స్టడీ అవర్స్ లో విద్యార్థులందరిని బయట ఒకే దగ్గర కూర్చోబెట్టారని,తరగతి గదిలో బాలుడు నిద్రిస్తున్న విషయం గమనించపోవడంతో ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. ఇది కావాలని చేసింది కాదని అనుకోకుండా జరిగిన సంఘటన అని తెలిపారు.ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని లేనిచో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## లైంగిక వేదింపుల నుండి పిల్లలను, మహిళలను రక్షించడం అందరి బాధ్యత

**లింగాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** లైంగిక వేధింపుల నుండి పిల్లలను, మహిళలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ పద్మ అన్నారు. గురువారం లింగాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, షీ టీమ్ ఆధ్వర్యంలో బాలికలకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ పద్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లైంగిక వేధింపులకు పాల్పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యతతో కూడిన జాగ్రత్త పాటించాలని కోరారు. ఎక్కడైనా వేధింపులకు గురిచేస్తే, షీ టీమ్ దృష్టికి తీసుకురావాలని కోరారు. మీకు ఎల్లవేళలా అందుబాటులో ఈ యొక్క నెంబర్కు 100, లేదా 8712657676 డయల్ చేయవచ్చు అని తెలిపారు. అదేవిధంగా మహిళల రక్షణ కోసం జిల్లాలో షి టీమ్స్ అందుబాటులో ఉందని, ఎక్కడైనా మహిళలకు అన్యాయం జరిగినట్లయితే వెంటనే 8712657676 నెంబర్‌కు సమాచారం అందజేస్తే వెంటనే మీ దగ్గరికి చేరుకొని మీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ వెంకట్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బషీర్ గారు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గలగల పారిన కృష్ణమ్మ ఆనందంలో రైతన్న

### మాటిచ్చిన రెండు రోజుల్లో సాగునీరు

**బిజినేపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** శాయిన్పల్లి శివారులోని ఎర్రకుంట, ఊర చెరువులకు ఆయకట్టు, పరిసర రైతాంగానికి ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాటిచ్చిన రెండు రోజుల్లో గలగల పారిన కృష్ణ జలాలతో రైతులు ఆనందంలో మునిగితేలారు. రెండు రోజుల క్రితం మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ ద్వారా సాగునీటి కాలువలకు అవసరమైన మార్గాలను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పరిశీలించారు. పక్కనే కృష్ణా జలాలు పారుతున్న సాగునీరు లేక ఎండుతున్న పంటలను చూసి చలించిన ఎమ్మెల్యే తాత్కాలికంగా సాగునీటి కాలువలతో వించి రెండు రోజుల్లో తమ పంట పొలాలకు సాగునీరు ఇవ్వడం పట్ల ఆ ప్రాంత రైతులు ఆనందంలో మునిగితేలారు. ఈ సందర్భంగా శాయిన్పల్లి సర్పంచ్ అవంతి శంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ దీప్లా నాయక్ ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డికి శాయిన్పల్లి, వసురాం తాండ, గంగారం గ్రామాల రైతులు, శివ, కురుమయ్య, లక్ష్మినారాయణ, సూరి, నిరంజన్, రాములు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల పాలిట వరం సీఎం సహాయ నిధి

**ఊర్కొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** పేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఊరుకొండపేట గ్రామనికి చెందిన చింతల విజయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇట్టి విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లిన్ల అనిరుధ్‌రెడ్డి వెంటనే స్పందించి రూ.2.50 లక్షల రూపాయల విలువగల ఎల్ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతకుముందు 15 రోజుల క్రితం రూ.2.50 లక్షల ఎల్ఓసీని కూడా అందించారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి మొత్తం రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేశామని, సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదల పాలిట వరమని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షులు కైసార్, నాయకులు వహిదొద్దీన్, మనోహర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాంద్‌పాషా, నాయకులు మ్యాకల శ్రీనివాసులు, రాజేష్, రవీందర్ సాగర్, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత కేసు నమోదు

**ఖిల్లాఘనపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సోలిపూర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన తేనేటి సాయికుమార్ రెడ్డి గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర రేషన్ బియ్యం కిలో పది రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్ దుబ్బాక పరమేష్ సదరు వ్యక్తి ఇంట్లో పరిశీలించగా 9 క్వింటాళ్ల బియ్యము 26 ప్లాస్టిక్ బస్తాలలో ఇంట్లో నిల్వచేసి ఉండటంతో రేషన్ బియ్యం కొనుగోలు చేయడం అమ్మకాలు చేయడం చట్ట విరుద్ధమని పంచుల సమక్షంలో బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వనపర్తి స్టాక్ పాయింట్ కు తరలించినట్లు చెప్పారు. బియ్యం కొనుగోలు చేసిన సాయికుమార్ రెడ్డి పై పోలీస్ స్టేషన్లో దుబ్బాక పరమేష్ ఫిర్యాదు చేయగా ఏఎస్సై సత్యనారాయణ గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పెబ్బేర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

### సుగురు దర్గాలో ప్రత్యేక పూజలు చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** పెబ్బేరు ఉమ్మడి మండలంలో గురువారం రోజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు భాగంగా సుగురు దర్గాలో ప్రత్యేక పూజలు చేసి ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుగురు గ్రామంలో సిసి రోడ్లు తాపీ కార్మిక భవనం భూమి పూజ చేసిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్దే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం అని పలు అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామాలలో ఎస్ సి సబ్ ప్లాన్ ద్వారా విడుదలైన సిసి రోడ్లకు, డ్రైనేజీలకు భూమి పూజతో పనులు ప్రారంభించారు. కంబాలాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిసి రోడ్డు, కంచిరావుపల్లిలో బీటీ రోడ్డు సిసి రోడ్డు, నగరాల ఒకటవ కేంద్రంలో వాటర్ ట్యాంకు, శ్రీరాంగాపురంలో, వెంకటాపూర్, జానంపేట, సుగురు, బునియాద్పూర్, లో సిసి రోడ్లు రంగాపురంలో గ్రామ పంచాయతీ భవనం, బీటీ రోడ్డు, బూడిద పాడులో



సుగురు గ్రామంలో సిసి రోడ్లకు భూమి పూజ

అంగన్వాడి భవనం, జనంపల్లిలో సిసి రోడ్డు, ఈర్లదిన్నె అంగన్వాడి భవనం, సిసి రోడ్డు, అయ్యవారిపల్లి లో ఐమాక్స్ లైట్లు, సిసి రోడ్డు, ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు మండల కమిటీ నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు విజయ వర్ధన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు, నరసింహనాయుడు, ఎంపీడీఓ, ఎంఆర్ఓ, పంచాయతీ సెక్రెటరీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేసాగర్, నాయకులు బి రామచంద్ర రెడ్డి, సురేందర్ గౌడ్, శ్రీహరి, బిరం రాజశేఖర్, సుగరు కురుమూర్తి, షకీల్, జగదీశ్వర్ రెడ్డి, డి వెంకటేష్, టి రాములు యువజన కాంగ్రెస్ నాయకులు ఏం రాజేష్ టిఎంఆర్ శివ ,సాయి రెడ్డి, సుగురు శివ, జి శివ, వివిధ రకాల కంగ్రాట్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ ఉమ్మడి పేరు శ్రీరంగాపూర్ మండల పర్యటనలో ఉన్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి లబ్ధిదారులకు నేరుగా వారి వారి గ్రామాల పర్యటనలో భాగంగా పెబ్బేరు మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు 50 సీఎంఆర్ఎఫ్ చెక్కులు 49 శ్రీరంగాపురం మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు 61 సీఎంఆర్ చెక్కులు 29 చెక్కులను లబ్ధిదారులకు నేరుగా ఎమ్మెల్యే అందజేశారు. అందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీసీలకు భరోసా కల్పించిన ప్రభుత్వం:రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీసీలకు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించే విషయంలో ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మదనాపూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడుతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెడతామని, శాసనసభ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అఖిలపక్ష ప్రతినిధి బృందం ఢిల్లీకి



మాట్లాడుతున్న రాచాల యుగంధర్ గౌడ్

వెళ్లి ప్రధానితోపాటు అన్నిపార్టీల నేతలను కలిసి పార్లమెంటులో బిల్లు పాస్ చేయించేందుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలను కూడగట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బీసీలకు చట్టపరమైన రిజర్వేషన్లు వచ్చేదాకా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయవద్దని బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జెఏసి చేసిన విజ్ఞప్తికి స్పందించిన ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు నిర్వహిస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, బీసీల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమగ్ర కుల సర్వేలో ఇప్పటివరకు పాల్గొనని ప్రజలకు మరోసారి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లకు మద్దతివ్వాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్,రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న, గౌడ సంఘం మండల అధ్యక్షుడు అక్కల మహదేవన్ గౌడ్, నాయకులు సంపత్ కుమార్, రాఘవేందర్, కృష్ణయ్య, సాయిబాబా, శ్రవణ్, బత్తుల జితేందర్, దేవర శివ, గౌతమ్ శంకర్, మ్యాదరి రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణా అథారిటీ శాఖ సభ్యుడిగా సతీష్ రెడ్డి పదవి బాధ్యతలు

**ఇటిక్యాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రాంతీయ రవాణా శాఖ అథారిటీ సభ్యులుగా మానవపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సతీష్ రెడ్డి నియామకం కాగా గురువారం ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో జిల్లా అధికారుల సమక్షంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రాష్ట్ర రవాణా శాఖ అథారిటీ సభ్యులు సతీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు భద్రత విషయాలలో తన వంతు బాధ్యతలు నిర్వహిస్తానని రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని ప్రజలకు మెరుగైన రోడ్డు రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని గద్వాల్ జిల్లా లో రోడ్డు భద్రత పై ప్రత్యేక శ్రద్ధ పెడతానని సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారిని నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. మాజీ జడ్పిటిసి, తెలంగాణ టెలికాం డైరెక్టర్ ఇస్మాయిల్, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారాం రెడ్డి జోగులాంబ ఆలయ ధర్మకర్త సభ్యులు జగన్ మోహన్ నాయుడు, అల్లంపూర్ మండల అధ్యక్షుడు రాము. డీసీసీ జనరల్ సెక్రటరీ సిరాజ్. అల్లంపూర్ నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు గోపాల్,జయన్న, వెంకటేష్‌యాదవ్, పరమేష్,నారాయణపురం భాస్కర్ రెడ్డి,ఎండి రఫీ,రాజ్‌కుమార్,వీరారెడ్డి,లక్ష్మిరెడ్డి, వెంకట్ రాముడు, నరేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనం ద్వారా ఇంటి వద్దకే ఇసుక సరఫరా

### అక్రమ ఇసుక వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** జిల్లా ప్రజల అవసరం మేరకు మన ఇసుక వాహనం ద్వారా ఇంటి వద్దకే ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని, ఇసుకకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడు ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాలో అక్రమ ఇసుక వ్యాపారం చేసేవారి పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 12 ఇసుక రీచ్ లు ఉన్నాయని, గృహ నిర్మాణాలు చేపడుతున్న జిల్లా ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుక ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇసుకకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురైనట్లయితే ఐడిఓసి లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08545233525 కు కాల్ చేసి తెలపవచ్చని చెప్పారు. నేరుగా వచ్చి సమస్య తెలియజేయాలనుకునేవారు ఐడిఓసి లోని రూమ్ నెంబర్ 115 కి వచ్చి తమ సమస్యలను తెలియజేసి సహాయం పొందవచ్చు అని చెప్పారు. ఉదయం ఆరు గంటల నుంచి, సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

## మూడవ విడత ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

**వనపర్తి క్రైమ్,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా వ్యాప్తంగా మూడవ విడత ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. గురువారం జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలో ని 16 కళాశాలల్లో నిర్వహించబడుతున్న ప్రాక్టికల్ పరీక్షలను పరిశీలించారు. నగరంలోని సీవీ రామన్ జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల, విజ్ఞాన్ జూనియర్ కళాశాలల ను డిఐఈఓ సందర్శించి పరీక్షల పనితీరును, రికార్డులను, విద్యార్థుల హాజరు, మార్కుల నమోదును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్వితీయ సం. ప్రయోగ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా ఉదయం పరీక్షలకు మొత్తం 503 విద్యార్థులకు గాను, 488 విద్యార్థులు హాజరైనారు, 15 విద్యార్థులు గైర్హాజరైనారు. మధ్యాహ్నం పరీక్షలకు మొత్తం 385 విద్యార్థులకు గాను, 272 విద్యార్థులు హాజరైనారు, 13 విద్యార్థులు గైర్హాజరైనారు. మొత్తం 888 మందికి 860 మంది హాజరయ్యారు, 28 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నరేంద్ర కుమార్, శ్రీనివాసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు కవిత , శ్రీనివాస్ లు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

## రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని సలహాలు ఉండాలి: డా.జగన్ మోహన్ రెడ్డి

**బిజినపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సమాచారాన్ని అందజేసే విధానాల్లో అనేక నూతన విస్తరణ పద్ధతులను అనుసరిస్తూ, క్షేత్ర స్థాయిలో కావాల్సి న సమాచారాన్ని రైతాంగానికి అందించాలని డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డా.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, తాండూర్ ఏరువాక కేంద్రాలు గురువారం శాస్త్రీయ సలహా, సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా. జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగానికి సరైన సమయంలో అందించాలని సూచించారు. అదే విధంగా రైతులు క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించే విధంగా విస్తరణ కేంద్రాలు పని పనిచేయాలని సూచించారు. ఈ క్రమంలో నూతన విస్తరణ పద్దతుల గురించి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, డ్రోన్ టెక్నాలజీస్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టూల్స్, టెక్ ఫామింగ్ వంటి ఇనవేటివ్ మెథడ్స్ వాడాలని వివరించారు. ఏడిఆర్ డా. బి. పుష్పవతి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, రైతుల ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని సుస్థిర సమగ్ర వ్యవసాయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విస్తరణ కేంద్రాలు గత సంవత్సరం చేపట్టిన వివిధ రకాల విస్తరణ కార్యక్రమాలు, పరిశోధనలు గురించి వివరిస్తూ రాబోయే భవిష్యత్తు కార్యచరణ ప్రణాళికలను వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు వ్యవసాయ అనుబంధ రంగాల అంశాల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు వారి యొక్క వర్క్ డన్ ఫలితాలను ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు, జిల్లా అధికారులు, బ్యాంకర్స్ రైతులు పాల్గొన్నారు.

# గద్వాలలో మార్మోగిన శివ నామస్మరణ

**గద్వాల,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** గురువారం గద్వాల జిల్లా కృంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దంపతులు బండ్ల జ్యోతి, కృష్ణ మోహన్ రెడ్డి, కుమారుడు సాయి సాకేత్ రెడ్డి ఏర్పాటు చేసిన రుద్రహోమం, రుద్రాభిషేకం, మండపం పూజ, మహా పడి పూజను ఘనంగా నిర్వహించి ఆది దంపతులైన పరమ శివపార్వతుల ఆశీస్సులు పొందడం జరిగింది. ఓం నమః శివాయ శివ మహా పడి పూజ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని



వ పూజలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

శివనామస్మరణతో ఆ మహా మహా దేవుణ్ణి కొలవడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నానని గద్వాల నియోజకవర్గం సుభిక్షంగా ఉండి, అన్ని విధాలుగా అభివృద్ధి జరగాలని, వర్షాలు సకాలంలో కురిసి, రైతులు, పాడిపంటలతో కళకళలాడాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే దంపతులు తెలిపారు. ఎటువంటి చీడ, పీడలు దరిచేరకుండా మహా దేవుణ్ణి కొలవడం జరిగిందని, అందులో భాగంగానే హోమం, పడిపూజా, శివ స్వాములు, శివ భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. శివ స్వాములు, శివ భక్తులు, భక్తి శ్రద్దలతో ఏక నామస్మరణతో పూజలు నిర్వహించినందుకు స్వాములందరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆ ఈశ్వరుని ఆశీస్సులతో ఎల్లప్పుడూ గద్వాల సుభిక్షంగా వెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే దంపతులు పేరు, పేరునా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, శివ భక్తులు, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, జడ్పి మాజీ చైర్మన్ బండారి భాస్కర్, పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ జి. వేణుగోపాల్, రమేష్ నాయుడు, మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ జడ్పిటీసి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి రాజారెడ్డి, మాజీ జంబు రామన్ గౌడ్, మాజీ జడ్పి టీసి రాజశేఖర్, మాజీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు మురళి, శ్రీనివాసులు, నాగేందర్ యాదవ్, నెమలికంటి రామాంజనేయులు, నరహరి శ్రీనివాసులు, నాగిరెడ్డి, పులిపాటి నాగేష్ శ్రీధర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, రఘు రాజ్ గౌడ్, ఎంపీపీ సుబాన్, ప్రతాప్ గౌడ్, విజయ్ కుమార్ మోహన్ రెడ్డి, సత్యారెడ్డి, విక్రమ్ సింహా రెడ్డి ,నవీన్ కుమార్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, మహబూబ్, చిన్న రాజు, టీచర్ కృష్ణయ్య, మైల గడ్డ శేఖర్, ఫయాజ్, పాల్గొన్నారు.

## ఆదాయం పైనే దృష్టి

### నా హయాంలో కార్పొరేషన్ గా ఏర్పడడం గర్వంగా ఉంది

### మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి కమిషనర్‌గా నేటితో ఏడాది పూర్తి



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** తన హయాంలో మహ బూబ్‌గర్ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా ఏర్పాటు కావడం గొప్ప అచీవ్మెంట్‌గా భావిస్తున్నట్లు మహబూబ్నగర్ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.గత ఏడాది కాలంలో మున్సిపాలిటీ ఆదాయంపైనే ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.. గత ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన మహబూబ్నగర్ మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 24 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 50 కోట్ల పన్నుల టార్గెట్ పెట్టుకోగా 34 శాతం వరకు పూర్తి చేసినట్లు మన తెలిపారు. సుమారు 14.50 కోట్లకు పైగానే పన్నుల రూపంలో ఆదాయం సమకూరినట్లు వివరించారు.

**అక్రమ నిర్మాణాలపై చర్యలు..** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల సెట్ బ్యాక్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల నిర్మాణం చేపట్టినందుకు తన దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్పొరేషన్‌గా మహబూబ్‌నగర్.. 70ఏళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉన్నది. మొన్నటిదాకా 49 వార్డులతో మున్సిపాలిటీగా కొనసాగిన మహబూబ్‌నగర్ ఇక మీదట కార్పొరేషన్ గా మారింది. దివిటిపల్లి ,జైనల్లిపూరు కలుపుకొని మొత్తం 60 వార్డులతో కార్పొరేషన్‌గా ఏర్పాటయిందని తన హాయంలో కార్పొరేషన్ గా మారడం గొప్ప అచీవ్‌మెంట్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటింటి సమగ్ర ఆర్థిక కుల గణన సర్వేను కూడా విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు.మహబూబ్‌నగర్ కార్పొరేషన్ను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా ఆదాయంలో నెంబర్ వన్ గా, స్వచ్ఛతలో నెంబర్ వన్‌గా, తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**మక్తల్,ఫిబ్రవరి13 ప్రభాతవార్త:** తన మనవరాలిని బస్సు ఎక్కించేందుకు బస్టాండ్‌కు వచ్చిన వృద్ధురాలి పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో తీవ్ర గాయాల పాలైన ఘటన మక్తల్ ఆర్టీసీ బస్టాండ్ లో గురువారం ఉదయం జరిగింది. మక్తల్ పట్టణానికి చెందిన పారిజాత (80) గురువారం ఉదయం తన మనవరాలిని రాయచూరు పట్టణానికి పంపించేందుకు బస్టాండుకు రాగా, నారాయణపేటకు వెళ్లేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సు వృద్ధురాలిని బలంగా ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో బాధితురాలిని హుటాహుటిన మహబూబ్ నగర్ ఆసుపత్రికి తరలించారు.

## పేట బస్టాండ్‌లో అధికారుల తనిఖీలు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని కొత్త బస్టాండ్, మినీ గ్రౌండ్లో బాల కార్మికులు బిక్షటన చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న బాల కార్మికులకు సంబంధిత జిల్లా అధికారి కరిష్మా తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు చిన్నారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల కార్మికులను పనులు చేర్పించుకుంటే చట్టపరమైన చర్యలు తప్ప ఉన్నారు. బాల కార్మికులతో పని చేయించడం, హింసించడం, అక్రమ రవాణా చేయడం, చట్టరీత్యా నేరమని అందుకు శిక్షకు అర్హులు అవుతారని, పిల్లలు బడికి దూరంగా సమస్యల్లో ఉంటే 1098కి సమాచారం ఇవ్వాలని, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సమన్వయకర్త జి.నంసింహులు అన్నారు.

## రేపు సంత్ సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్ కార్యక్రమం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** లంబాడి గిరిజన గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని గిరిజన భవన్, అయ్యప్ప గుట్ట మహబూబ్‌నగర్ పట్టణంలో రేపు (ఈనెల 15వ తేదీన) ఉదయం 9:30 గంటలకు సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బంజారా సోదర, సోదరీమణులు, జిల్లా గిరిజన నాయకులు, అధికారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా సరోజినీ నాయుడు జన్మదినం

**బిజినేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** కారుకొండ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం సరోజినీ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ సరోజినీనాయుడు గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలని, గొప్ప కవయిత్రి,స్వతంత్ర భారతదేశానికి తొలిమహిళాగవర్నర్ అని చెప్పారు.భారత కవికోకిల అనే బిరుదు ఉందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, ఇంద్రా ణి, భాగ్యలక్ష్మి ,శ్రీకాంత్ ,భారతి , మేఘన విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక నిల్వలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు

### అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :** జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక నిల్వలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం పెబ్బేరు మండల పరిధిలోని రంగాపురం గ్రామపరిధిలో 45ట్రిప్పుల అక్రమంగా డంపుచేసిన డంపు 400ట్రాక్టర్ల ఇసుకను ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ తో కలిసి తనిఖీ సందర్భంగా గుర్తించారు. అక్రమ ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిసిన సమాచారం మేరకు తనిఖీ కై వెళ్ళగా అక్రమ ఇసుక నిలువలను గుర్తించారు. అక్రమంగా డంపు చేసిన ఇసుకను వెంటనే సీజ్ చేయాలని, ఇల నిల్వలు చేసి అమ్ముకుంటున్న వారిని గుర్తించి కేసులు పెట్టాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ ఓనర్లపై కేసులు నమోదు చేయాలని ఆర్డీఓ కు సూచించారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, పెబ్బేరు ఎమ్మార్వో లక్ష్మి, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.